సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
78932 44734
నంబర్‌ను సంప్రదించండి



భయపడాల్సి వస్తోంది

వైద్యో నారాయణ హరి అన్న మాటకు ప్రస్తుతం ప్రాధాన్యం తగ్గుతున్నట్టు అనిపిస్తోంది. ఆస్పత్రుల్లో భద్రత లేని ఉద్యోగాలుగా మారిపోయాయి. రాత్రి సమయాల్లో ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నాం. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయాల్లో ఇద్దరు కానిస్టేబుళ్లతో అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తే ఉద్యోగులకు ధైర్యంగా ఉంటుంది. మేము కూడా మెరుగైన వైద్యం అందించ గలుగుతాం. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి. – జి. నాగలక్ష్మి హెడ్ నర్స్, సీహెచ్‌సీ, గోపాలపట్నం

భద్రత పటిష్టం చేయాలి



రాత్రి విధుల్లో ఉండే మహిళా వైద్యులకు రక్షణ అవసరం. చాలా ఆస్పత్రుల్లో మహిళా సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరైన సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. మహిళా వైద్యులు నైట్ డ్యూటీ చేసే సమయాల్లో మహిళా సిబ్బంది సహాయకులుగా ఉండాలి. వైద్యానికి వచ్చే వారికి చాల విషయాలపై అవగాహన ఉండదు. అలాంటి వారు కొన్ని సందర్భాల్లో ఆవేశానికి లోనై దాడులకు దిగుతారు. వారిని కట్టడి చేసేవ్యవస్థ అవసరం. – డాక్టర్ షబ్నం, సీహెచ్‌సీ, గోపాలపట్నం

వేతన ఒప్పందంపై విశాఖ పోర్టు కార్మికుల హర్షం

సాక్షి, విశాఖపట్నం : మేజర్ పోర్టుల కార్మికుల వేతన సవరణకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ ఆమోదం తెలిపారు. ఇరుపార్టీల వేతన చర్చా కమిటీ, ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ పరస్పర అంగీకార పత్రాలపై బుధవారం సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం 2021 డిసెంబర్ 31 నాటి ప్రాథమిక వేతనంపై 8.5 శాతం లబ్ధి, 2022 జనవరి 1 నాటికి 30 శాతం వీడీఏ అదనంగా అందజేయనున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. ఈ వేతన ఒప్పందం వల్ల కార్మికులకు న్యాయం చేసే దిశగా కీలక ముందడుగు వేస్తున్నట్లు అవుతుందని శర్బానంద సోనోవాలా తెలిపారని విశాఖ పోర్టు చైర్మన్ డా.అంగముత్తు వెల్లడించారు. చర్చలు ఫలప్రదంగా సాగడంలో సానుకూలంగా వ్యవహరించిన కార్మిక సంఘాలు, ఇండియన్ పోర్టు అసోసియేషన్ ప్రతినిధులను మంత్రి ప్రశంసించారు. వేతన ఒప్పందానికి సంబంధించి కార్మిక సంఘాలు 28న నిరవధిక సమ్మెకు పిలుపునివ్వగా.. కేంద్ర మంత్రి జోక్యంతో దేశంలోని 12 మేజర్ పోర్టులకు సంబంధించిన కార్మిక నేతలు సమ్మెను విరమించినట్లు ప్రకటించారు. చర్చల అనంతరం జరిగిన ఒప్పందం మేరకు 2022 జనవరి 1 నుంచి 2026 డిసెంబర్ 31 వరకు ఐదేళ్ల కాలపరిమితికి వేతన సవరణలు అమలు చేయనున్నట్లు పోర్టు చైర్మన్ తెలిపారు. సమ్మెను విరమింపజేయడంలో తీసుకున్న చొరవపై ఆరు కార్మిక సంఘాల ప్రతినిధులు కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- రేయింబవళ్లు తయారు చేస్తున్న కళాకారులు
- తోటపోలమాంబ ఆలయం వేదికగా విగ్రహాల తయారీ



తోటపోలమాంబ ఆలయ ప్రాంగణంలో తయారవుతున్న వినాయక విగ్రహాలు

గోపాలపట్నం: వినాయక చవితి సమీపిస్తోంది.. ఆది దేవునికి తొలి పూజ చేసేందుకు భక్తులు కూడా సిద్ధమవుతున్నారు. దీంతో నిర్వాహకుల అభిరుచులకు అనుగుణంగా జీవీఎంసీ 91వ వార్డు పరిధిలోని తోటపోలమాంబ ఆలయ ప్రాంగణంలో వినాయక ప్రతిమలను తయారు చేయడంలో కళాకారులు బిజీబిజీగా ఉన్నారు. అయితే ఈ సారి సాధారణ విగ్రహాలే తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

తుది మెరుగులు


వినాయకుని ప్రతిమలను తయారు చేసిన కళాకారులు వాటికి తుది మెరుగులు దిద్దుతున్నారు. కలర్స్ వేస్తున్నారు. ఇక్కడ తయారు చేస్తున్న బొమ్మలు రూ.2 వేల నుంచి రూ.లక్ష వరకూ ఉన్నాయి. ఉత్సవ కమిటీల ప్రతినిధులు వారికి కావాల్సిన బొమ్మలకు అడ్వాన్స్ ఇచ్చి బొమ్మలపై నెంబర్లు వేయించుకుంటున్నారు.

ఆర్డర్ ప్రకారం తయారీ

కొంతమంది తమకు కావాల్సిన ఆకృతుల ప్రకారం బొమ్మలు తయారు చేయాలని ఆర్డర్లు ఇస్తున్నారు. రూపం ఎలా ఉండాలి.. ఏయే రంగులు వేయాలో వారే నిర్ణయిస్తున్నారు. దాని ప్రకారం వాటిని తయారు చేస్తున్నారు. కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారుల కుటుంబాల వారు గుడారాలు వేసుకుని వినాయకుని ప్రతిమలు తయారు చేస్తున్నారు. విగ్రహాల తయారీకి ప్రత్యేకంగా కోల్‌కతా నుంచి మట్టి తీసుకు వస్తారు. కర్రలతో ముందు ఆకారం.. ఆ తర్వాత గడ్డితో రూపం దాని మీద మట్టితో పూర్తి స్వరూపం తెస్తారు. దాన్ని రంగులు, హంగులతో అందంగా తీర్చిదిద్దుతారు. ఏటా వినాయక చవితితో పాటు దసరాకు దుర్గాదేవి, విశ్వకర్మ, కృష్ణాష్టమి పూజల కోసం ఇక్కడ బొమ్మలు తయారు చేస్తున్నారు. విగ్రహాలు సిద్ధం చేయడానికి 12 మంది పని చేస్తున్నారు. యజమాని పని వాడుంటూ బేధం ఉండదు.



శ్రద్ధగా.. అలంకరణశుద్ధిగా...



ఆకట్టుకుంటున్న విగ్రహం

180 ఆర్డర్లు వచ్చాయి



ఈ ఏడాది 180 ఆర్డర్లు వచ్చాయి. పెద్ద విగ్రహాలు 3 నెలల కిందట ఆర్డర్ ఇస్తే చేయగలుగుతాం. చిన్న విగ్రహాలు చాలా మంది అప్పటికప్పుడు వచ్చి కొనుగోలు చేస్తారు. కొందరు విగ్రహాల నమూనాను సెల్ ఫోన్లో తీసుకు వచ్చి చేయాలని ఆర్డర్ ఇస్తారు. దాన్ని బట్టి తయారు చేస్తాం. ఈ సారి వెరైటీగా విగ్రహాలు తయారు చేయాలని పెద్దగా ఎవరూ రాలేదు.

– రాజ్‌పాల్, కోల్‌కతా

మట్టి విగ్రహాలే చేస్తాం



ఇక్కడికి పదేళ్ల నుంచి వస్తున్నాను. మేమంతా మట్టి విగ్రహాలే తయారు చేస్తాము. గతంలో కంటే చాలా మార్పు వచ్చింది. 3 అడుగుల నుంచి 12 అడుగుల వరకు తయారు చేస్తాం. ఈ ఏడాది రాముడు, సింహాద్రి అప్పన్న రూపాలతో విగ్రహాలు తయారు చేయాలని అడుగుతున్నారు. వారికి నచ్చిన రూపాల్లో విగ్రహాలు తయారు చేసి ఇస్తున్నాం.

– అనూప్ పాల్, కళాకారుడు, కోల్‌కతా

తాగునీటి బోరు బావి ప్రారంభం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ ఏర్పాటు చేసిన నూతన తాగునీటి బోరును బుధవారం వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్థానికుల ద్వారా సమస్య తెలుసుకుని బోరు ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో నాయకులు పుక్కల రాజారావు, జెర్రిపోతుల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో పందిరి రాటమహోత్సవం



పందిరిరాట మహోత్సవంలో పాల్గొన్న విజయ్ తదితరులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డ్ శాంతినగర్‌లో స్థానిక శాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం వరసిద్ధి వినాయకుడి ఉత్సవాలకు పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది 15 అడుగుల గణపయ్యను ఏర్పాటు చేసి సుమారుగా 21 రోజులు పాటు పూజలు నిర్వహిస్తామని శాంతినగర్ యువజన విభాగం అధ్యక్షుడు జియ్యాని విజయ్ కుమార్ చెప్పారు. పందిరిరాట మహోత్సవం పురస్కరించుకొని అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు ,యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్కు పరిశుభ్రతకు చర్యలు



పార్కును శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

విశాఖ విద్య:జీవీఎంసీ 52వ వార్డు గౌరీ నగర్‌లోని పార్కు పరిశుభ్రతకు నగర పాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నెల 25న 'ఆహ్లాదం దూరం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో పార్కులో నెలకొన్న అపరిశుభ్రతపై ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య కార్మికులు పార్కు అంతటినీ శుభ్రం చేశారు. బల్లల వద్ద చెత్తను తొలగించారు. వ్యాయాయ పరికరాలు ఉపయోగించుకునేలా అక్కడ ఉన్న గడ్డి తొలగించారు. పార్కులో వాకింగ్ ట్రాక్ చుట్టూ పెరిగిన మొక్కలు కత్తిరించి, వినియోగంలోకి తీసుకొచ్చేలా ఏర్పాట్లు చేశారు. దీనిపై పరిసర కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

అబ్బురపరిచిన భక్తప్రహ్లాద నాటకం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 38వ వార్షికోత్సవంలో భాగంగా కళాభారతి వేదికగా ఐదో రోజు ప్రదర్శించిన భక్తప్రహ్లాద నృత్యరూపకం అందరినీ అబ్బురపరిచింది. డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి రూపకల్పనలో ఆయనే హిరణ్యాక్షుడిగా నటించి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. ప్రహ్లాదుడిగా నిఖిత అద్భుతంగా నృత్యం చేసి అందరినీ ఆకట్టుకుంది. నాటకంలో ప్రతి ఘట్టాన్ని కూచిపూడి నృత్య రీతులతో రక్తికట్టించారు. ముఖ్య అతిథి రాగం కిషోర్, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, వేదాంతం రామలింగేశ్వరశాస్త్రిలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు



మల్కాపురంలో ఉట్టి కొడుతున్న చిన్నారి

మల్కాపురం: శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారంతో ముగిశాయి. సోమవారం నుంచి పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీకృష్ణుడి ఆలయాల్లో యాదవ సంఘాల ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాపురం యాదవవీధి వద్ద శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులచే శ్రీకృష్ణుని వేషధారణలు వేయించి ఉట్టి కొట్టే సంబరాలు ఉత్సాహంగా చేపట్టారు. సాయంత్రం శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వెంకన్నపాలెంలో స్వామిని ఊరేగించారు. యాదవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్ జామ్



హైవేపై క్రేన్‌తో పనులు చేస్తున్న దృశ్యం

విశాఖ విద్య: ఎన్ఏడీ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌కు ఆనుకొని ఆర్‌వోబీ పనులు జరుగుతున్నాయి. అయితే బ్రిడ్జి పిల్లర్లు వేసే క్రమంలో క్రేన్ రోడ్డుకు అడ్డంగా నిలపడంతో ట్రాఫిక్ జామ్ అయింది. జాతీయ రహదారిపై ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా వాహనాల రద్దీ ఉంటుంది. ఇలాంటి సమయంలో క్రేన్‌ను రోడ్డుపై నిలిపి పనులు చేయడంపై వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే చోట తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఏదైనా జరగరాని సంఘటన జరిగిన తర్వాత హడావుడి చేసేకంటే ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాటిపై దృష్టి సారించి వాహనదారులు కోరుతున్నారు.

కొడుకులు ఉన్నా.. అనాథలా ఆఖరి మజిలీ

- అంత్యక్రియలు నిర్వహించిన మమత చారిటబుల్ ట్రస్ట్



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: కొడుకులు ఉన్నా పట్టించుకోకపోవడంతో అతడి ఆఖరి మజిలీ ఓ అనాథలా జరిగింది. మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమత కుమార్తెలా మారి ఆ వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించింది. వివరాల్లోకి వెళితే...వృద్ధ దంపతులు తులసి లక్ష్మీ నారాయణ, ఎండమ్మ నగర శివారు ఎండాడ ప్రాంతంలోని ఓ ఆలయం వద్ద ఉండేవారు. ఆ తర్వాత ఎండాడ వద్దగల ఫుట్ పాత్ పైనే జీవనం సాగిస్తుండడంతో విషయం తెలుసుకున్న మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమత వారిని ఏడాది కిందట నగరంలోని ఓ వృద్ధాశ్రమంలో చేర్పించారు. బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్న మమత ఆ వృద్ధుల గురించి ఆరా తీయగా ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిసింది. అయితే వారు తమ తల్లి దండ్రుల గురించి పట్టించుకోలేదు. వృద్ధాశ్రమంలో ఉన్నారని వారికి సమాచారం ఇచ్చినా తీసుకెళ్లేందుకు ముందుకు రాకపోవడంతో మమతే వారికి పెద్ద దిక్కుగా మారి ఆశ్రమానికి అప్పుడప్పుడూ వెళ్లి వారి బాగోగులు చూస్తుండేవారు. ఆఖరి దశలో ఉన్న ఆ వృద్ధ దంపతులను కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు మమత చాలా సార్లు ప్రయత్నం చేసినప్పటికీ వారి నుంచి స్పందన లేదు. పెద్దాయన ఆరోగ్యం బాగోకపోవడం తో బుధవారం ఉదయం మృతిచెందారు. ఈ సమాచారం కొడుకులకు తెలియజేసినప్పటికీ రాలేదు. ఎండమ్మ శ్మశానవాటిక వద్దకు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఎల్లేటి మమత , మన కుటుంబం వృద్ధాశ్రమం సిబ్బంది రమణ, భాస్కర్ సహాయంతో నగరంలోని జ్ఞానాపురం శ్మశాన వాటికలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు.











